క్లుప్తంగా

కష్టపడితే ఉజ్వల భవిష్యత్తు



విజేతలతో హెచ్ఎం, ఉపాధ్యాయులు

కమలాపురం: కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని నల్లింగాయపల్లె జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం రహమత్ బషీర అన్నారు. పోటీ ప్రపంచంలో ప్రతి విద్యార్థి అన్ని రంగాల్లో రాణించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సోమవారం పాఠశాలలో ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో సామాజిక అంశాలపై చేపట్టిన సర్వే గురించి జరిపిన కాంపిటీషన్‌లో గెలుపొందిన విజేతలకు హెచ్ఎం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాధన చేస్తే సాధించలేనిది ఏదీ లేదన్నారు. ప్రతి ఒక్కరూ ప్రణాళికా బద్ధంగా చదివితే లక్ష్యాన్ని సాధించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏకలవ్య ఫౌండేషన్ ప్రతినిధి వీర నారాయణ, హ్యూమన్ రైట్స్ మండల చైర్మన్ సిద్ధయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అయ్యప్ప దీక్షలు చేపట్టిన భక్తులు



అయ్యప్ప భక్తులకు అయ్యప్ప మాలధారణ చేస్తున్న గురుస్వామి

పులివెందుల టౌన్ : పట్టణంలోని పార్నపల్లె రోడ్డులోని శ్రీ అయ్యప్పస్వామి ఆలయం, శ్రీ మిట్ట మల్లేశ్వరస్వామి ఆలయాల్లో సోమవారం ఒక్క రోజే 300 మంది భక్తులు అయ్యప్ప దీక్ష మాల ధరించారు. అలాగే పట్టణంలోని శ్రీ మిట్టమల్లేశ్వరస్వామి ఆలయంలో డిసెంబర్ 2వ తేదీ వరకు ప్రతిరోజు అయ్యప్ప భక్తులకు బిక్ష (అన్నదానం) ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో సోమవారం అయ్యప్ప భక్త మండలి, గురుస్వాముల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డితో పాటు గురుస్వాములు అయ్యప్ప భక్తులకు బిక్ష అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న ఇన్‌చార్జి ఎస్ఐ ఎస్ఎండీ షరీఫ్

సింహాద్రిపురం : మండల కేంద్రమైన సింహాద్రిపురంలోని హిమకుంట్ల క్రాస్ వద్ద సోమవారం సాయంత్రం ఇన్‌చార్జి ఎస్ఐ ఎస్ఎండీ షరీఫ్ వాహనాలను తనిఖీ నిర్వహించి పలు పత్రాలు లేని వాహనాలకు జరిమానా విధించారు. వాహనదారులు తప్పనిసరిగా ధ్రువ ప్రతాలను కలిగి ఉండాలని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ సచివాలయం పరిశీలన

వల్లూరు (చింతకొమ్మదిన్నె) : చింతకొమ్మదిన్నె మండలంలోని రసూల్ పల్లె గ్రామ సచివాలయాన్ని సోమవారం ఎంపీడీఓ కులాయిబాబు, ఈఓఆర్డీ వెంకటసుబ్బారెడ్డి పరిశీలించారు. ఎంపీడీఓ సచివాలయ రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సిబ్బంది అందరూ ఖచ్చితంగా ఉదయం పది గంటలకు, మధ్యాహ్నం మూడు గంటలకు, సాయంత్రం ఐదు గంటలకు బయోమెట్రిక్ హాజరు తప్పకుండా వేయాలని ఆదేశించారు. గ్రామ ప్రజలు వివిధ పనుల కోసం సచివాలయానికి వచ్చినప్పుడు వారితో వినయంగా మాట్లాడి వారి పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.

దివ్యాంగులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ



దివ్యాంగులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేస్తున్న మేజిస్ట్రేట్ శ్రీనివాసులు తదితరులు

పులివెందుల టౌన్ : పట్టణంలోని దివ్యాంగుల సంఘం కార్యాలయంలో సోమవారం కుంచా సోమయ్య ద్వితీయ వర్ధంతి సందర్భంగా సోమవారం దివ్యాంగులకు ప్లేట్లు, గ్లాసులు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ శ్రీనివాసులు హాజరై మాట్లాడారు. కుంచా సోమయ్య సేవలు వెలకట్టలేమని, మంచి మనసున్న వ్యక్తి, మనవతా మూర్తి, స్నేహ శాలిగా కుంచా సోమయ్య మంచి గుర్తింపు తెచ్చుకున్నారని కొనియాడారు. ఆయన గతంలో పట్టణంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో కమిటీలో మెంబర్‌గా కూడా కొనసాగారని, అలాంటి మంచి వ్యక్తి మనమధ్య లేకపోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో సోమయ్య కుటుంబ సభ్యులు శివ, శేఖర్, హరీష్, ఉమాదేవి, చంద్రిక, సుమలిక, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

దోమ కాటు.. పశువులకు చేటు

- పాల ఉత్పత్తి తగ్గుముఖం
- పశువుల ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం
- పాడి రైతులు జాగ్రత్తలు పాటించాలి



గేదెలకు వైద్యం చేస్తున్న పశుసంవర్ధకశాఖ సిబ్బంది

ఎర్రగుంట్ల : వర్షాకాలంలో మనుషులే కాదు పశువులు కూడా దోమకాటుకు గురవుతున్నాయి. దోమకాటు వలన పశువులు వ్యాధుల బారిన పడే అవకాశం ఉంది. దీనిని ముందుగా అరికడితే మూగజీవాలను ఆరోగ్యవంతంగా చూసుకోవచ్చు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో పల్లపు ప్రాంతాలు, ఖాళీస్థలాల్లో వర్షపు నీరు నిలిచిపోయి దోమలు వృద్ధి చెందుతాయి. దోమకాటు వలన పశువులు రోగాల బారిన పడడం కాకుండా పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోతోందని యర్రగుంట్ల మండల పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టరు మునెయ్య సూచిస్తున్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి

నియోజకవర్గంలో అధిక శాతం రైతులు పాడి పశువులపై ఆధారపడి జీవిస్తున్నారు. ఈ తరుణంలో రైతులు తగు జాగ్రత్తలు తీసుకోకపోతే పాడి పశువులకు గొంతువాపు వ్యాధి , దొమ్మువ్యాధి, గాలికుంటు వ్యాధులు సోకే అవకాశం ఉందని పశు వైద్యాధికారులు సూచిస్తున్నారు. పశువుల్లో వ్యాధి లక్షణాలు గుర్తిస్తే తక్షణమే వైద్యులను సంప్రందించాలని చెబుతున్నారు.

గొంతు వాపు వ్యాధి

వర్షాకాలంలో పశువులకు ప్రధానంగా వచ్చే జబ్బు గొంతు వాపు వ్యాధి. దీనిని గరక వ్యాధి అని కూడా అంటారు. వర్షాకాలంలో పశువులకు దోమలు, సూక్ష్మజీవుల వలన వస్తుంది. ఇది అంటువ్యాధిగా ఇతర పశువులకు వ్యాప్తి చెందుతుంది. కలుషితమైన నీరు, మేత ద్వారా రోగనిరోదక శక్తి తగ్గి వ్యాధి బారిన పడి కంటి నుంచి నీరు, నోటి నుంచి శ్వాస పీల్చడం కష్టతరంగా మారుతుంది. జ్వరం తీవ్రత 104 నుంచి 106 డిగ్రీల వరకు ఉంటుంది. గొంతు కిందకు నీరు చేరి గొంతు వ్యాపు వస్తుంది.

టీకాలు వేయించాలి

ముందస్తుగా జూన్, జూలైలో వ్యాధి నిరోధక టీకాలు చేయించాలి. వ్యాధి ఉన్న పశువుల దొడ్డిని క్రిమిసంహాకర మందులతో శుభ్రం చేయాలి. వ్యాధి లక్షణాలు కనిపించిన పశువును వెంటనే మంద నుంచి వేరు చేసుకోవాలి. వ్యాధి సోకిన పశువుకు వ్యాధి తీవ్రతను బట్టి సల్ఫాడిమిడిన్, ఇంటాసెఫ్‌టాజు, ఇంజక్షన్ ఇవ్వాలి. మిగిలిన పశువులకు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు సమీప పశువుల వైద్యాధికారిని సంప్రదించి తగిన సూచనలు సలహాలు తీసుకోవాలి.

గాలికుంటు వ్యాధి

గాలికుంటు వ్యాధి దోమకాటు, వైరస్ సోకడం లేదా కలుషితమైన గాలి ద్వారా వచ్చే వ్యాధి. తల్లిపాల ద్వారా దూడలకు వస్తుంది. ప్రతి ఏడాది వర్షాకాలంలో విరివిగా పశువులకు గాలికుంటు వ్యాధి సోకుతుంది. గిట్టలు ఉన్న ప్రతి జీవి ఈ అంటువ్యాధి బారిన పడుతాయి. వ్యాధి సోకిన సమయంలో పశువులకు 104 నుంచి 105 డిగ్రీల వరకు ఉష్ణాగ్రత ఉంటుంది. నోటీలో గిట్ల మధ్య పుండ్లు పడి పశువులు నడవలేని పరిస్థితి ఎదుర్కొంటాయి. మార్చి, సెప్టెంటర్, అక్టోబర్ నెలల్లో ఈ వ్యాధి పశువులకు వచ్చే ప్రమాదం ఉంది. ఈ వ్యాధి సోకిన పశువుకు గిట్ట మధ్య బొబ్బలు ఏర్పడతాయి. 3,4 వారాల్లో బొబ్బలు, పగిలి పుండ్లుగా మారుతాయి. చర్మం గరుకగా మారి నోటి చిగుళ్లపై పొక్కులు ఏర్పడడం చేత పశువులు మేత మేయలేక పోతాయి. నీరసంగా ఉంటాయి.

చికిత్స

వ్యాధి సోకిన పశువును మంద నుంచి ముందుగా వేరు చేయాలి. నోటీలోని పుండ్లకు బోరిక్ పౌడర్, గ్లిసరిన్ కలిపి పూయలి. గిట్టల మధ్య పుండ్లకు పరమాంగనెట్ ద్రావణంతో శుభ్రం చేసి వేపనూనె పూయాలి. యాంటిబయోటిక్స్, పెయిన్‌కిల్లర్స్ వాడితే నొప్పి నుంచి ఉపశమనం కలుగుతుంది.

పశువు ప్రాణానికే ప్రమాదం



వర్షాల వలన దోమలు పెరిగి వ్యాధులు వ్యాపిస్తాయి. దోమల వలన పశువులకు జ్వరం, అలర్జీ అధికంగా వస్తాయి. దీని వలన పాల దిగుబడిపై ప్రభావం చూపడమే కాకుండా పశుప్రాణాలను హరిస్తాయి. దోమల వలన నష్టం జరగకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలి.

–డాక్టర్ మునెయ్య, పశుసంవర్థక శాఖ ఏడీ, యర్రగుంట్ల మండలం

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న పులివెందుల డీఎస్పీ మురళీ నాయక్

పులివెందుల రూరల్ : రక్తదానం ప్రాణదానంతో సమానమని పులివెందుల డీఎస్పీ మురళీ నాయక్ అన్నారు. సోమవారం పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పులివెందుల పట్టణంలో డీఎస్పీ కార్యాలయ ఆవరణంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని డీఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రక్తదానం చేసిన ప్రాణదాతలు కావాలని పిలుపునిచ్చారు. రక్తదానం చేయడంపై ఎలాంటి అపోహలకు గురికావద్దని. ప్రతి మూడు నెలలకొకసారి రక్తదానం చేయడం వలన ఆరోగ్యం కూడా బాగా ఉంటుందని తెలిపారు. ఈ రక్తదాన శిబిరంలో పాత్రికేయులు, పోలీసు సిబ్బంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో సీఐలు జీవన్ గంగానాథ బాబు. వెంకటరమణ, ట్రాఫిక్ సీఐ హాజీవలి, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

ఏజెంట్లకు కమీషన్ తగ్గించడం అన్యాయం



ఎల్ఐసీ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఏజెంట్లు

జమ్మలమడుగు: జీవిత బీమా సంస్థలో ఏజెంట్లు కమీషన్ తగ్గించడం అన్యాయమని లియాఫీ అధ్యక్షుడు గురుశేఖర్, ట్రెజరర్ జింకా శేఖర్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక జీవిత బీమా సంస్థ కార్యాలయంలో మధ్యాహ్నం గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవిత బీమా సంస్థ ఏజెంట్లకు కమీషన్ తగ్గించడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా పాలసీ దారుడు సంవత్సరం లోపు పాలసీని సరండర్ చేసుకుంటే ఏజెంట్ల నుంచి కమీషన్ రికవరి చేయడం మంచి పద్ధతి కాదని వాపోయారు. జీవిత బీమా సంస్థ కోసం కృషి చేస్తున్న ఏజెంట్లను ఇబ్బందులకు గురిచేయడం సరైంది కాదన్నారు. ఏజెంట్లకు రావలసిన కమీషన్‌ను పెంచాలని డిమాండ్ చేశారు.

సాయంత్రం 4గంటల వరకే ఉచిత ఇసుక

జమ్మలమడుగు: ఇంటి అవసరాల కోసం వినియోగదారులు పెన్నానదిలో గుర్తించిన పాయింట్లలో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4గంటల లోపే ఉచిత ఇసుకను తీసుకెళ్లాలని తహసీల్దార్ పి.శ్రీనివాసులు రెడ్డి పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎటువంటి డబ్బులు చెల్లించకుండా ఇంటి అవసరాల కోసం పెన్నానదిలో మోరగుడి, కన్నెలూరు, గొరిగేనూరు వద్ద పెన్నానదిలో ఉచితంగా ఇసుకను తీసుకువెళ్లవచ్చని సూచించారు. అక్రమంగా ఇతర ప్రాంతాలకు తరలించే ప్రయత్నం చేస్తే కఠిన చర్యలతో పాటు జరిమాన విధిస్తామని హెచ్చరించారు.

విజ్ఞాన పురోగతితోనే అభివృద్ధి



జ్యోతి ప్రజ్వలన చేసి వర్క్‌షాపును ప్రారంభిస్తున్న డైరెక్టర్ తదితరులు

వేంపల్లె : విజ్ఞాన శాస్త్ర పురోగతితోనే అభివృద్ధికి బాటలు వేయగలమని డైరెక్టర్ ఎంవీఎస్ కుమార స్వామి గుప్తా పేర్కొన్నారు. ఇంజినీరింగ్ విభాగంలో ఆధునిక పరిశోధనలు, సాంకేతిక సమీకరణాలు చర్చించడానికి లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన వివరించారు. ఆర్జీయూకేటీ పరిధిలోని ఆర్కేవ్యాలీ క్యాంపస్‌లో సివిల్ ఇంజినీరింగ్ పరిశోధనలో ఆధునికత (ఎసీఈఆర్ - 2024)అనే శీర్షికతో రెండు రోజులపాటు వర్క్ షాప్ నిర్వహించగా సోమవారం విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమానికి ఆర్జీయూకేటీ పరిధిలోని నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం, ఆర్కేవ్యాలీ ట్రిపుల్ ఐటీల్లోని ప్రముఖ నిపుణులు, పరిశోధకులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ వర్క్ షాప్‌లో రిమోట్ సెన్సింగ్ జీఐఎస్ సివిల్ ఇంజినీరింగ్‌లో ఎలా ఉపయోగించాలో క్లుప్తంగా వివరించారు. భూమి, మౌలిక విషయాలు, నేల సంరక్షణ పరస్పర సంబంధం వంటి అనేక అంశాలపై ప్రస్తావనలు చేయబడడం ద్వారా గ్రౌండ్ ఇంప్రూమెంట్ సాంకేతికతలను కూడా చర్చించారు. ప్రొఫెసర్లు, పరిశ్రమ నాయకులు తమ పరిశోధన ఫలితాలను సమర్పించి సివిల్ ఇంజనీరింగ్ యొక్క భవిష్యత్తుపై విలువైన దృష్టి కోణాలను అందించారు. ఈ కార్యక్రమంలో పరిపాలన అధికారి డాక్టర్ రవికుమార్, డీన్ అకాడమిక్స్ రమేష్ కైలాస్, విద్యార్థుల సంక్షేమ అధికారి వెంకటేష్, హెచ్ ఓడి ధనుంజయ, కన్వీనర్లు సునిల్ భగత్, సరవన కుమార్, నాలుగు ట్రిపుల్ ఐటీల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సెమినార్

కెమికల్ ఇంజినీరింగ్ రంగంలో ఉద్యోగ అవకాశాలు, పరిశ్రమల్లో ప్రగతిని ఎలా సాధించాలో విద్యార్థులకు ప్రేరణ కల్పించినట్లు డైరెక్టర్ కుమార స్వామి గుప్తా పేర్కొన్నారు. సోమవారం ఆర్కేవ్యాలీ ట్రిబుల్ ఐటీ చదువుకున్న పూర్వపు విద్యార్థి సత్యం రాజు ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిబుల్ ఐటీని సందర్శించారు. ప్రస్తుతం ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాలో పనిచేస్తున్న సత్యం రాజు కెమికల్ ఇంజనీరింగ్ అవకాశాలు మరియు ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగాల గురించి విద్యార్థులకు సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పరిపాలన అధికారి రవికుమార్, కెమికల్ ఇంజనీరింగ్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



హాజరైన ట్రిపుల్ ఐటీల అధ్యాపకులు, విద్యార్థులు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



గాయపడిన అన్వర్‌బాషా

వల్లూరు (చింతకొమ్మదిన్నె): చింతకొమ్మదిన్నె మండల పరిధిలో ఊటుకూరు సమీపంలోని శుభం కల్యాణ మండపం వద్ద ప్రమాదవశాత్తు జాతీయ రహదారి డివైడర్‌ను ద్విచక్రవాహన దారుడు భగత సింగ్ నగర్‌కు చెందిన అన్వర్‌బాషా ఢీ కొట్టాడు. ఈ ప్రమాదం అన్వర్‌బాషా తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్పందించిన స్థానికులు బాధితుడిని ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

దీపావళిని సంతోషంగా జరుపుకోవాలి

కడప కోటిరెడ్డిసర్కిల్: దీపావళిని ప్రజలు సంతోషంగా జరుపుకోవాలని కడప రెవెన్యూ డివిజనల్ అధికారి జాన్ ఇర్వీన్ అన్నారు. సోమవారం స్థానిక కడప రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయ ఆవరణలోని థామస్ మన్రో మీటింగ్ హాల్లో దీపావళి పండుగ సందర్భంగా బాణసంచా దుకాణాల కేటాయింపునకు రెవెన్యూ డివిజనల్ అధికారి జాన్ ఇర్వీన్, కడప మున్సిపల్ కమిషనర్ మనోజ్ రెడ్డి సమక్షంలో లక్కిడిప్ ఎంపిక కార్యక్రమాన్ని ప్రారంభించి సిస్టం ద్వారా ప్రదర్శించారు. ఆయన మాట్లాడుతూ రెవెన్యూ డివిజనల్ అధికారి ఇచ్చిన లైసెన్స్ మాత్రమే ఉండాలని, లైసెన్స్, జీఎస్టీ లేని వారు బాణసంచా దుకాణం నిర్వహించకూడదని పేర్కొన్నారు.

రేపు శివపార్వతుల కల్యాణం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో బుధవారం మాస శివరాత్రి పర్వదిన సందర్భంగా ప్రత్యేక పూజాకార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం అగస్త్యేశ్వర స్వామి, రాజరాజేశ్వరి అమ్మవారి మూలవిరాట్‌లకు విశేష అభిషేకాలు, అర్చనలతో పాటు ప్రత్యేక అలంకరణ ఉంటుందని పేర్కొన్నారు.

● ఆరిన పొలం.. రబీ ముమ్మరం

రబీ సాగుకు రైతులు ఉపక్రమించారు. వాన తెరపి ఇచ్చి ఎండలు కాస్తుండటంతో పొలాలు ఆరుతున్నాయి. దీంతో విత్తనాలు, నాట్లు వేసేందుకు భూమి అనుకూలించిన ప్రాంతాల వారు పొలం పనుల్లో బిజీ అయ్యారు. అయితే రబీలో మెట్ట ప్రాంత రైతులు శనగ పంటను మాత్ర పంటగా భావిస్తారు. మూడు నెలల్లో పంట చేతికి రావడంతో పాటు సాగుకు సులభంగా ఉంటుందని శనగ పంటపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. మండలవ్యాప్తంగా 25 వేల ఎకరాల్లో ఎర్ర శనగ, 10 వేల ఎకరాల్లో తెల్ల శనగ పంటను సాగు చేసేందుకు అన్నదాతలు సిద్ధం అయ్యారు.

– పెద్దముడియం



విత్తన శుద్ధి చేసిన ఎర్ర శనగలు



సాగుకు సిద్ధంగా ఉన్న తెల్ల శనగలు



శనగ పంటను ట్రాక్టర్ ద్వారా విత్తనం వేస్తున్న రైతు

డీఏఈ ప్లాటినం జూబ్లీ వేడుకలు



విద్యార్థులకు యురేనియం ప్రాజెక్టు విశిష్టతను తెలుపుతున్న మైనింగ్ అధికారులు

వేముల : వేముల మండలం తుమ్మలపల్లె యురేనియం ప్రాజెక్టులో సోమవారం 70వ డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ ప్లాటినం జూబ్లీ వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలకు వేముల, లింగాల మండలాల ప్రభుత్వ ఐటీఐ కళాశాలల విద్యార్థులు హాజరయ్యారు. అనంతరం విద్యార్థులకు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మైనింగ్ డీజీఎం కిశోర్ భగత్ హాజరై న్యూక్లియర్ ఎనర్జీ బెనిఫిట్స్, సేఫ్ ఎనర్జీ ప్రొడక్షన్ వైపు విద్యార్థులను ప్రేరేపించాడు. అలాగే మైనింగ్ మేనేజర్ మోహన్‌రెడ్డి యురేనియం ప్రాజెక్టులోని అన్ని యూనిట్లకు సంబంధించిన సమాచారాన్ని అందించారు. అనంతరం ప్రభుత్వ ఐటీఐ కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులకు డీఏఈ మెమెంటో, సమాచార బ్రోచర్లను అందజేశారు. యురేనియం ప్రాజెక్టు అధికారులు ఎం.ఎస్.రావు, సుమన్ సర్కార్, మోహన్ రెడ్డి, అమ్జద్ అలీ, ఎల్.కోటేశ్వరరావు, సోంజోయ్ ఛటర్జీ, వాసుదేవ్ రెడ్డి, రవి, భద్రోదాస్, గౌతం కొల్లూరు, కె.నాగరాజు, ఎస్.బాషా, ఎస్.వి.రెడ్డి పాల్గొన్నారు.

ఆలయానికి రూ 2.85 లక్షల ఆదాయం

చెన్నూరు (వల్లూరు): చెన్నూరు మండల పరిధిలోని శివాల్‌పల్లెలో వెలసిన శ్రీ కాశీ విశ్వనాథ స్వామి ఆలయంలో భక్తులు సమర్పించిన తలనీలాల సేకరణ హక్కు, కొబ్బరి కాయల విక్రయ హక్కులకు స్థానిక ఆలయ ప్రాంగణంలో సోమవారం బహిరంగ వేలం పాట నిర్వహించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కే. శ్రీనివాసులు తెలిపారు. నవంబర్ 1 వ తేదీ నుంచి సంవత్సరం పాటు తలనీలాల సేకరణ, కొబ్బరి కాయల విక్రయ హక్కుల కోసం దేవాదాయ శాఖ కడప డివిజన్ ఇన్‌స్పెక్టర్ సీ. శివయ్య పర్యవేక్షణలో బహిరంగ వేలం పాట నిర్వహించినట్లు తెలిపారు. తలనీలాల సేకరణ హక్కు వేలంలో కే. క్రిష్ణయ్య రూ 1,05,900 దక్కించుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా కొబ్బరికాయల విక్రయ హక్కు కోసం నిర్వహించిన వేలం పాటలో సుబ్బయ్య రూ 1, 80 ,000 లకు దక్కించుకున్నట్లు తెలిపారు. కాగా గత సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది తలనీలాల సేకరణ హక్కు వేలం పాట ద్వారా రూ 16,900, కొబ్బరి కాయల విక్రయ హక్కు వేలం పాట ద్వారా రూ 63,000 అధిక ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శివారెడ్డి, సుదర్శన్, అర్చకులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



దర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు

జమ్మలమడుగు: మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణంలో సమస్యలను పరిష్కరించాలంటూ ధర్నా నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయ అధికారికి సీఐటీయూ వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్‌కుమార్ జి.ఏ సుదాసు, దాసరి విజయ్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ సిబ్బందికి పరికరాలు, యూనిఫాం చెప్పులు, వారాంతపు సెలవులు, జాతీయ సెలవులు అమలు చేయడంతో పాటు పండగ కానుకను చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో మైకేల్, బాలు, పుల్లమ్మ, మరియమ్మ, తిరుపాలమ్మ తదితరులు పాల్గొన్నారు

సమస్యలు పరిష్కరించలేనప్పుడు సమావేశాలెందుకు?

- మండల సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధుల మండిపాటు



సమస్యలపై అధికారులను నిలదీస్తున్న ప్రజాప్రతినిధి

వేంపల్లె : మండల సర్వసభ్య సమావేశంలో ప్రజా ప్రతినిధులు చెప్పిన సమస్యలకు పరిష్కారం కానప్పుడు సమావేశాలెందుకు నిర్వహిస్తున్నారని అధికారులను ప్రజాప్రతినిధులు ప్రశ్నించారు. సోమవారం స్థానిక వైఎస్సార్ సభా భవనంలో ఎంపీపీ లక్ష్మీగాయత్రి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. గత సమావేశంలో ప్రజా ప్రతినిధులు లేవనెత్తిన సమస్యలకు అధికారులు పరిష్కరించలేదని ఎంపీటీసీలు కటిక చంద్రశేఖర్, భారతి, మణిగోపాల్ రెడ్డి సభలో నిలదీశారు. ఏడేళ్లుగా వేంపల్లి పంచాయతీలోని పాత పేట, గాండ్ల వీధి, మెయిన్ బజార్, కాపువీధి, కతీఫ్ వీధి తదితర ప్రాంతాలకు బోర్ వాటర్ తప్ప పాపాగ్ని నది నుంచి తాగునీరు అందించడం లేదని ప్రజాప్రతినిధులు సమావేశం దృష్టికి తీసుకువచ్చిన ఫలితం లేదన్నారు. అందుకు జెడ్పీటీసీ రవికుమార్ రెడ్డి చొరవ తీసుకొని మండలంలో తాగునీటి సమస్య రాకుండా ఉండేందుకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే ప్రభుత్వ స్థలాల్లో అంగన్వాడీ కేంద్రాలను నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఐసీడీఎస్ సీడీపీఓ సునీతకు సూచించారు. అనంతరం మండల వ్యవసాయ శాఖ అధికారి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీతో అందించే విత్తనాలను వ్యవసాయ పరికరాలను, అమలు చేసే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పంటల బీమా చెల్లించాలి

గత ప్రభుత్వంలో పంటల బీమా ప్రభుత్వమే చెల్లించేదని, కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక వివిధ రకాల పంటల బీమాకు రైతులే ప్రీమియం చెల్లించాలని సభ్యులు కోరారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట దెబ్బతిన్నప్పుడు బీమా ఉంటే రైతులకు ఎంత ఉపయోగపడుతుందని తెలిపారు. అలాగే మండల విద్యాశాఖ అధికారి స్టాలిన్ ఐజాక్ మాట్లాడుతూ మండలంలో ఇటీవల ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునేందుకు పిల్లలు లేక అయ్యవారిపల్లి గ్రామంలో ప్రాథమిక పాఠశాల మూత పడిందని, అలాగే ఎగువ తువ్వ పల్లె, కత్తులూరు, మిట్టపల్లి, ముసల్ రెడ్డి గారి పల్లె గ్రామాల్లో ఐదు మంది విద్యార్థుల కంటే తక్కువ ఉన్నారని వీటిని తొందర్లోనే మూత పడే అవకాశం ఉందని, ఆ గ్రామ సర్పంచులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని విద్యార్థులు డ్రాపౌట్స్ లేకుండా చూసుకోవాలని సూచించారు. జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధాన ద్వారం వద్ద ఉన్న చెత్త కుండీని తొలగించాలని ఎంపీటీసీ మణి గోపాల్ రెడ్డి కోరారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో హనుమాన్ జంక్షన్ వద్ద నుంచి నాలుగు రోడ్ల కూడలి గుండా రాజీవ్ కాలనీ వరకు, గండి రోడ్డులోని సాయి రజిత పెట్రోల్ బంక్ వరకు 72 అడుగుల మేర రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. అందుకు అప్పటి ప్రభుత్వం రూ. 60 కోట్లు నిధులు మంజూరు చేసింది. కాంట్రాక్టర్ రూ. 10 కోట్ల మేర పనులు పూర్తి చేశారని, కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక బిల్లులు చెల్లించకపోవడంతో రోడ్డు నిర్మాణ పనులను ఎక్కడికక్కడే వదిలేసి వెళ్లారని తెలిపారు. ఎంపీడీఓ కులాయమ్మ, తహసీల్దార్ హరినాథ్ రెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు, మండల స్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.